# ఆక్షేపణ లేదు!

శ్రీ 'ధర్మరాజు'

"ఆయ్యా! తిండిగింజలు అయిపోయినయి. కుండెడు గింజలు యిప్పించండి. పది రోజులాగి ఇడుగబట్టి." కొండల్ రెడ్డిని కాయన్న అడిగాడు.

అరుగుమీద కూర్చుని హోగచుట్ట పీలుస్తూ అప్పుడే త్రాగిన కల్లు మంచిచెడ్డల గురించి పక్కయింటి రైతు లింగయ్యతో మాట్లాడుతున్న కొండల్ రెడ్డి కాయన్నవైపు చూస్తూ "ఏమిరా! పెండ్లాంపక్కలోకి రాగానే అప్పసంగతి మరచావు ఏ నెలజీతం ఆ నెల తీసుకుంటున్నావు. మున్నూరుపాయిల అప్పు అట్లాగే వుంది. వడ్డీకూడా చెల్లుబోవటం లేదు. పైగా ఇంకా గింజలు కావాలంటున్నావు." అన్నాడు

"నిజమే పటేలా! కాని నీ బాంచను ఏం జెయ్యాలె. పొట్ట కెళ్ళటంలేదు. మీరు దయదలచకపోతే యెట్లా బతుకుతాం గులాపోణ్ణి" కాయన్న తల నేలకువేసి, వున్న సంగతి బయట పెట్టాడు.

"నీకేమైన పిల్లలారా ?"

"పిల్లలెక్కడినుంచి పటేలా, ఎండా కాలంలో మొదటి కాన్పుంది." కొండల్ రెడ్డిమాట మార్చి పక్కనున్న లింగయ్యను చూస్తూ "ఈ అలగా జనానికి సంతానం బాగా వుంటుందోయ్. మా పెద్దోడి భార్య కాపరానికొచ్చి అయిదేళ్ళయింది. పిల్లలు లేరు. మా మేనమామ సంగతి తెలుసుగా. ఎంత ఆస్తి, ఎంత తెలివి, ఎంత పేరు ప్రతిష్టలు; కాని సంతానం లేదు. ఏం చిత్రమోగాని ఆస్తివుంటే పిల్లలుండరు. పిల్లలుంటే ఆస్తి వుండదు."

"నీ పెద్దకొడుకు రెండో పెండ్లిగురించి అనుకుంటూ వుంటివి ఏమయింది?" లింగయ్య అడిగాడు.

"అనుకున్నా. కాని మనసుమీదికి తీసుకోలేదు. చూద్దాం. భగవంతుడేం చేస్తాడో" కొండల్ రెడ్డి నిరుత్సాహంతో అన్నాడు.

"మా వాడు అంతయ్యా కొత్తవేషం వేస్తున్నాడయ్యా! పెండ్లి చేసుకోడట; అప్పు లేవద్దట. తన ఇష్టం వచ్చిన పిల్లను ఇష్టం వచ్చినపుడు చేసుకుంటాడట. ఏం చదువో. ఏం సావాసమో" లింగయ్య తన పంచాంగం విప్పాడు.

"ఏం సావాసమేంటి. పాడుసావాసం. నీ విట్లాగే వూరుకుంటే చేతికిరాడు. పాడై

పోతాడు లింగయ్యా" కొండల్ రెడ్డి హెచ్చరించాడు.

"ఏం జెయ్యాలె. ఇంటికి వచ్చినప్పుడల్లా పోరుతూనే వుంటాను. అందుకోసమే గ్రామాలు తాతీళ్ళ (సెలవుల్లో) ఈసారి యింటికికూడా రాలేదు. ఎక్కడో సభలంట, సంఘాలంట, పాటలంట, ఎవరికెరుక యేంగోలో" లింగయ్య అన్నాడు.

"ఈ సంఘాలు గింగాలు మస్తుగ చూచాను. గాంధీ అని ఒకడున్నాడట. ఆయన చెప్పినదే శాస్త్రమంట, పాడిందే పురాణమంట, ఆ గాంధీని ఎన్నిసార్లు జైల్లో పెట్టినా కొట్టినా బుద్ధిరాలేదట. ఒకటే మొండిపట్టు ఒకసారి ఉరిదీస్తె మనిగూడా కుంపినీ సర్కారు అంటే మన ఆలాహజ్రత్ (నిజాం) వద్దన్నాడట. అందుకోసం బ్రతికిపోయిండు" కొండల్ రెడ్డి తన రాజకీయాలను లింగయ్యకు తెలిపాడు.

"మన ఆలాహజ్రత్ కు గాంధీమీద అంత ప్రేమెందుకో?" లింగయ్య ఆశ్చర్యంగా అడిగాడు.

"గాంధీ అంటే ప్రేమగాదోయ్. మన రాజ్యంలో ఉరిదీయవద్దని ఖానూను (లా) వుంది. అట్లాగే కుంపిణీ సర్కారును గూడా వురిదీయవద్దంటే సరే అని వూరుకున్నది. మన ఆలాహజ్రత్ అంటే యేమనుకున్నావు. బాబన్ బరాడ్, ఛెప్పన్ రాజ్యాలు చెప్పినట్టింటాయి" కొండల్ రెడ్డి కోసేశాడు.

"అయ్యా!" అని తిరిగి జీతగాడు శాయన్న కొండల్ రెడ్డిని చూస్తూ అన్నాడు

"చూడాం పో" కొండల్ రెడ్డి నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు. శాయన్న ఆశ వదులుకొని గొణుగుకుంటూ యింటిముఖం పట్టాడు.

## 2.

రెండోరోజు శాయన్న కొలువుకు రాలేదు. ఊరు విడిచి వెళ్ళిపోయాడు. ఎక్కడ పొయ్యాడో యేంచేస్తున్నాడో ఊరివాళ్ళకు తెలియదు. శాయన్న ఊరు విడిచి అక్కడక్కడ కూలి చేసుకుంటూ కొన్నాళ్ళకు హైదరాబాదు చేరుకున్నాడు బట్టలగిర్నిలో కూలీగా తయారయ్యాడు. ఊళ్ళల్లో మాదిగ వాండ్లను దూరం చేసినట్లు పట్టణంలో దూరంచేయక పోవడం శాయన్నకు చిత్రమనిపించింది. బాపని, మాదిగ మొదలగు బేధంలేకుండా బజార్లో తిరుగవచ్చు. సినిమాల్లో బస్సుల్లో కలసి కూర్చోవచ్చు అటకాయించిన వాడెవడూ కనబడలేదు. బట్టలగిర్ని కూలీసంఘం వ్యవహారం కూడా బాగానే వుంది.

కొండల్ రెడ్డి గుడ్లెర్రజేసి మాట్లాడితే వణికి పొయ్యే శాయన్న బట్టలగిర్ని కూలీ సంఘపు వూరేగింపుల్లో సభల్లో—

"మూడు నెల్ల మంగాయి భత్తా (D. A.) కావాలె.

"మిల్లు జాబర్ల మేస్త్రీల జులుం ముర్దాబాద్.

"జీతా లెక్కించాలె:

"లేకుంటే హర్తాల్ చేస్తాం.

"ప్రజల సర్కారు కావాలె.

"పోలీసు జులుం ముర్దాబాద్.

"లాల్ బావుటా జిందాబాద్"

అనిగొంతు చించుకొని కేకలేసేవాడు. ఉత్సాహంగా తలెత్తి, తాను ఒక మనిషిగా దర్జాగా నడవడం నేర్చుకున్నాడు.

మళ్ళీ సంవత్సరం తరువాత చుట్టాలను చూచి పెండ్లాన్ని తీసుకొని పోవాలని దేశం చేరుకొన్నాడు. శాయన్న వూరు విడిచిన తరువాత పెండ్లాం పుట్టింటికి చేరుకుంది. కాబట్టి ఒండకింది గూడెంలో కుటుంబమంటూ లేదు. వచ్చినప్పటినుంచి మాదిగగూడెంలో వాళ్ళను వీళ్ళను కలసి మాట్లాడుతూ కాలం వెళ్ళబుచ్చాడు. కొండల్ రెడ్డి జీతగాడు నర్సయ్య పెండ్లాం పోయి శాయన్నను తన యింటికి పిలుచుకొని పోయింది. శాయన్నను నర్సయ్య మొదట గుర్తుపట్టలేదు. కట్టుకున్న బట్టలు తనకంటె మంచిగావున్నాయి. సిగరెట్టు డబ్బి, అగ్గిపెట్టె జేబులోనుంచి కనబడుతున్నాయి. ఇవన్నీ నర్సయ్యకు నోట్లో నీళ్ళూరించాయి కాని రెండోవైపు నర్సయ్య దిగులులోపడ్డాడు. శాయన్నకు రాత్రికి అన్నంపెట్టాలె ఎట్లా? పెండ్లాం వైపు చూచాడునర్సయ్య. పెండ్లాంకూడా ఎటు తోచక తల నేలకు వేసింది.

'ఏమిటే? ఆలోచిస్తున్నావు.' అని శాయన్న నర్సయ్యను అడిగాడు.

'బువ్వకు కష్టంగావుందే. ఆకాలం రెక్కలు విరుచుకున్నా గడువడంలేదు. మా అయ్య జీతమున్నప్పుడు ఒక ముసలి యెద్దు తప్పిపోతే దానికింద నలుబై రూపాయలు బాకీ తేల్చిండు పటేలు. నెలకు కుంచెడు కోసుకుంటున్నాడు" అని తల నేలకువేసి ఆలోచిస్తూ అన్నాడు నర్సయ్య.

"నేనుకూడా ముప్పయి రూపాయి లివ్వాలిసుంది గదోయ్. అన్నీ దొంగ లెక్కలు కడుతారోయ్ వీళ్ళంతా" అంటూ శాయన్న జేబులోనుండి 8 అణాలు తీసి నర్సయ్యకిచ్చాడు.

నర్సయ్య ఆ అణాలు పెండ్లానికిస్తూ "ఉల్లిగడ్డలు చింతపండుకూడా తీసుకొని రావే 'పచ్చడి నూరుదువు' గాని అన్నాడు.

ఆరోజు రాత్రంతా శాయన్న పట్నం సంగతి కూలీలసంఘం సంగతి నర్సయ్యకు చెప్పాడు. పొద్దున మొదలు సాయంత్రం వరకూ మాదిగగూడెంలో అందరితో కలిసి తన అనుభవాలు తెలుసుకున్న రాజకీయాలు పూసగుచ్చినట్లు చెప్పాడు. కూలోళ్ళ సభలు, సంఘాలు, ఊరేగింపులు, ఉపన్యాసాలు వివరంగా చెప్పాడు. మొత్తం మాదిగగూడెంలో కొత్త ఆశ్చర్యం, ఆశ మేలుకున్నాయి

## 3

ఉదయం పక్కగ్రామం వెళ్లినకొండల్ రెడ్డి సాయంత్రం ఇల్లు చేరుకొని, ఇంటి ముందర వేపచెట్టు అరుగుమీద తన తొత్తులతో మాట్లాడుతూ కూర్చున్నాడు. బడే సాహెబు జవాన్ వచ్చి శాయన్న వచ్చాడని మాదిగగూడెంలో అందరికీ యెక్కిస్తున్నాడనీ బతేగప్పాలు కొడుతున్నాడనీ కొండల్ రెడ్డికి చెప్పాడు.

"వచ్చినాడని చెబుతున్నావు బద్మాష్ రెక్కలువిరిచి పట్టుకరా లంజాకొడుకును"

వెంటనే బడేసాహెబు మాదిగగూడెం పోయి శాయన్నను పట్టుకొని కొండల్ రెడ్డి వద్దికి తెచ్చి నిలబెట్టాడు. శాయన్నను కొండల్ రెడ్డి పిలిపించాడని తెలువగానే

మాదిగగూడెంలో భయం మొదలయింది. బండలెత్తి రూపాయిలు వసూలుచేస్తాడని అంతా జ్యోతిషం చెప్పారు. శాయన్నను చూడగానే కొండల్ రెడ్డి "ఓహో! మొగోడి రంగే మారిందోయ్. ఏమిరా నీ అప్పు యెవడు చెల్లిస్తాడురా? అప్పడిగితే చెప్పకుండా పారిపోతావురా? లంజా కొడుకునురూపాయిలు యిచ్చేదాకా కదల నీయను." అని బడేసాహెబును చూస్తూ వురిమాడు.

"ముప్పయి రూపాయిలు అయిదేండ్లు జీతం చేసినా తీరలేదా పటేలా?" అని ఇదేమన్యాయమన్నట్లు కొండల్ రెడ్డివైపు చూచాడు శాయన్న.

"దొంగముండాకొడుక మాటలుకూడా నేర్చుకున్నావ్. నీకు లెక్కకావలె చూపిస్తా లెక్క. ఆగుంజకు కట్టివేయరా" అని తన తల్లిపేర కోడెను కదిలినపుడు పాతినగుంజను బడేసాహెబుకు చూపాడు.

"నేనైతేఒక దమ్మిడికూడాయియ్యను. చంపితే చంపు" శాయన్న అన్నాడు. శాయన్న మాటలు బడేసాహెబుకే కోపం తెప్పించాయి. బడేసాహెబు తన చేతికట్టెతో శాయన్నను ఒక దెబ్బవేశాడు. శాయన్న పులివలె బడేసాహెబుమీద పడి కర్రతీసుకొని బడేసాహెబును బాదటం మొదలెట్టాడు.

కొండల్ రెడ్డి అసలే అసాధ్యుడు. పైగా బాగా తాగివున్నాడు. శాయన్న మాటలు, బడేసాహెబు పైనబడి కొట్టడం తనకు భరింపరాని సిగ్గుగా తలచాడు. కొండల్ రెడ్డి కళ్ళు తెరచి నప్పటినుంచి శాయన్నవలె ఎదురుతిరిగి మాట్లాడి తిరిగిన వాడెవడు లేడు. కొండల్ రెడ్డి కోపంతో వణికిపొయ్యాడు. వళ్ళుమరచి పిచ్చివాడిలాగా ఇంట్లోకి ఉరికి గడకొయ్య తెచ్చి బలంగా శాయన్న నెత్తిపై ఒకటేకొట్టడం మొదలు పెట్టాడు. శాయన్న తలపగిలి నెత్తురు కక్కుతూ క్రింద పడ్డాడు. కొద్దిసేపట్లోనే ప్రాణాలుపోయినై. అందరూ కలసి పీనుగను బజారునుంచి లోపలికి తెచ్చి పశువులదొడ్లో పడవేశారు.

నెత్తురు కండ్ల చూడగానే కొండల్ రెడ్డి మత్తు దిగింది. ఏమీ తోచక పిచ్చివానిలాగా ఇల్లంతా తిరగడం మొదలెట్టాడు. ఇంటి తలుపులు బిగించి కూర్చొని ఆలోచించ సాగాడు. పోలీసుల కాళ్ళు పట్టుకోవడం కంటే వేరే దోవలేదని రెండు వేల రూపాయలు తీసుకొని దొడ్డిగుండా పోలీసు స్టేషనుకు చేరుకున్నాడు శాయన్న చచ్చిన సంగతి వూళ్ళో అందరికీ తెలిసే పోయింది మాదిగ గూడెంలో కోపం భయమూ బయలు దేరాయి కాని ఏమి చెయ్యాలో తోచడంలేదు. శాయన్న చావుకు వణికి పొయ్యారు

'దెబ్బలతో పోలేదు చావులకుకూడా దిగుతున్నది' అని కొందరనుకున్నారు.

'ఏమిపుటకలు పాపపు పుటకలు' అని కొందరు నిరుత్సాహ పడ్డారు. 'ముప్పై రూపాయలకు ప్రాణాలే తీశారే! యేమి అన్యాయము!" అని కొందరు దుఃఖపడ్డారు

'ఎంతైనా తొందరపడే చేశాడని' కొందరు తలచారు.

'ఈ ఉసురు పోతుందీ ఏదో పాడుకే వచ్చిందని కొండల్ రెడ్డి భార్య దిగులు పడ్డది.

'ఎట్లా ఈ తప్పునుండి తప్పించుకుంటాడో" మాదా - మని కొండల్ రెడ్డి తొత్తులు కొండల్ రెడ్డి తెలివిపై చర్చించారు.

తెల్లవారేవరకు కొండల్ రెడ్డి దిడ్డి గుండా ఇంటికి చేరుకున్నారు. జాముపొద్దు యెక్కేవరకు పోలీసు సిబ్బందితో అమీన్ వచ్చేసాడు పంచనామా కూడా మాములు పోయింది.

తర్వాత కొన్నాళ్లకు శాయన్న చావును గురించి ఊరి చావిడిగోడమీద ప్రభుత్వ ప్రకటన ఇలా : వెలువడింది.

'శాయన్న పాముకరచి చచ్చాడని పోలీస్ అమీన్ రిపోర్టు పంపాడు కాబట్టి శాయన్నచావుపై ఎవరికైనా ఆక్షేపణ వుంటే 16 మహాశేవరు 1355 ఫసలీనాడు మున్సఫీ ఆదాలతు (కోర్టు)లో హాజరుకావలెను" ఈ విపరీతంచూసి లింగయ్యకొడుకు ముత్తయ్య, ముగ్గురువూరివాళ్ళను వెంటబెట్టుకొని సరాసరిగా అదేరోజు అదాలతుకు వెళ్ళాడు కొండల్ రెడ్డి శాయన్నను చంపాడని తానూ తనవెంటవచ్చిన ముగ్గురు గ్రామస్థుల సంతకాలతో ఆక్షేపణ వ్రాసి తెలిపాడు.

"శాయన్నకూ దరఖాస్తు ఇచ్చినవారికీ రేమీ సంబంధంలేదు. కాబట్టి ఆక్షేపణ అంగీకరింపబడజాలదని" మున్సఫీ నాజం (మాజిస్ట్రేటు) ఆక్షేపణను కొట్టివేశాడు; కనుక ఆ క్షే ప ణ లే దు. న్యాయంగా శాయన్నను పామే కరిచింది.

## లేవరా! లేవరా!

★ శ్రీ 'శశాంక'

లేవరా! లేవరా!
లేచి నడుంబిగించాలిరా!
అరుణారుణ క్రాంతి జ్యోతి
జాగృతిలో నవతరించి
సర్వ సుషుప్త్యవస్థకు
స్వస్తిచెప్పు సమయమిదే,
లేవరా! లేవరా!...
ఘనతిమిరావృత మయ్యెను
తుది సమరారంభమయ్యె
వృద్ధజగతి నిశీథాంత
మహస్సులో–ఉషస్సులా!...
లేవరా! లేవరా!...

నీ కడుపుకె తిండినిడని
నిఖిలలోక సిరిసంపద
సృష్టిస్తా వెందుకురా!
కష్టిస్తా వెందుకురా!
లేవరా! లేవరా!...
శ్రమ ఫలితం నాదేనని
బూర్జువాల ప్రతిఘటించి
వర్గరహిత స్వర్గానికి
అనాదిలో—పునాదివై
లేవరా! లేవరా!
లేచి నడుం బిగించాలిరా!